RNI: APTEL/2013/54506

# నేటి ప్రస్థానం

తెలుగు దినపత్రిక

హైదరాబాద్ | ఆదివారం 18-10-2026 | సంచిక: 13 | సంఖ్య: 360 పేజీలు: 4 | వెల: 5/- | ఎడిటర్: సందీప్ గౌడ్ వి

నేటి ప్రస్థానం
తెలుగు దినపత్రిక
నేటి ప్రసాదం తెలుగు దినపత్రికలో
పనిచేయుటకు
తెలుగు రాష్ట్రాల్లో
విలేకరులు కావలెను.
అర్హతలు:
• పత్రికారంగంలో అసక్తి కలిగి ఉండాలి.
• తెలుగు భాషపై పట్టు ఉండాలి.
• రిపోర్టింగ్ అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యం.
• స్థానిక సంఘటనలు వెలికితీసే అవగాహనం ఉండాలి.
• సమాజ సేవ చేయగల ఉత్సాహం ఉండాలి.
• అనుభవం లేనివారికి శిక్షణ ఇవ్వబడును.
వివరాలకు సంప్రదించండి:
+91 90004 05386

## దాండియా సంబరాల్లో అపశృతి: విద్యార్థిని దుర్మరణం..



- ఐదుగురి పరిస్థితి విషమం
- ఎంవీఎస్ఆర్ ఇంజనీరింగ్ కాలేజీ దాండియా వేడుకల్లో భారీ ప్రమాదం
- లైటింగ్ స్టాండ్ విద్యార్థులపై కూలడంతో వనపర్తికి చెందిన సోనీ అనే విద్యార్థిని మృతి
- సుమారు 25 మంది విద్యార్థులకు గాయాలు.. ఐదుగురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం
- ఈదురుగాలుల కారణంగానే లైటింగ్ క్రేన్ అదుపుతప్పి కూలినట్లు ప్రాథమిక అంచనా
- ప్రమాదంపై విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని సీఎం ఆదేశం

2లో

## తెలంగాణకు రేపటి నుంచి వర్ష సూచన..



- పలు జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ
- ఉరుములు, మెరుపులతో పాటు ఈదురుగాలుల హెచ్చరిక
- ఉత్తర తమిళనాడు తీరంపై కొనసాగుతున్న ఉపరితల ఆవర్తనం
- హైదరాబాద్ సహా అనేక జిల్లాలకు ఎల్లో వార్నింగ్ జారీ

## నవంబర్ రెండో వారంలో అందరం కలుద్దాం...
## గెట్ రెడీ!: విజయసాయిరెడ్డి



2లో

- ఏపీలో టీడీపీ, వైసీపీ మధ్య సివిల్ వార్ నడుస్తోందన్న విజయసాయిరెడ్డి
- పుంగనూరు, తాడిపత్రి ఘటనలను ప్రస్తావిస్తూ రెండు కుటుంబాలపై ఫైర్
- 'రెడ్ బుక్ వర్సెస్ రప్ప రప్ప' అంటూ రాష్ట్రంలో క్షీణించిన శాంతిభద్రతలపై ఆందోళన
- రెండు పార్టీలకు గుణపాఠం చెప్పే మూడో ప్రత్యామ్నాయం రావాలన్న విజయసాయి




## పులివెందులలో ఎన్నికల వేడి!

- నామినేషన్ కేంద్రం వద్ద ఉద్రిక్తత.. రంగంలోకి పోలీసులు
- నామినేషన్ల కేంద్రం వద్ద ఇరుపార్టీల శ్రేణుల మధ్య తోపులాట
- టీడీపీ నేతలను ముందుగా అనుమతిస్తామనడంతో వివాదం
- జనాన్ని చెదరగొట్టేందుకు ఆరు రౌండ్లు ఫైరింగ్
- ఎలాంటి గాయాలు కాలేదని అధికారుల ప్రకటన

2లో

# కరవు కోరల్లో తెలంగాణ..

## కేంద్ర సాయం కోసం రాష్ట్రం విజ్ఞప్తి

- 315 మండలాల్లో కరవు ప్రభావం ఉన్నట్లు అధికారుల నివేదిక
- 13.22 లక్షల ఎకరాలు తగ్గిన సాగు.. నల్గొండలో అధిక పంట నష్టం
- అందుబాటులో జలాశయాల్లో 209.45 టీఎంసీల నీరే
- రైతుల సహాయం కోసం రూ.1,986.89 కోట్ల ప్యాకేజీ ప్రతిపాదన



వర్షాభావం కారణంగా తెలంగాణలో వ్యవసాయ కార్యకలాపాలు ఒడిదుడుకులను ఎదుర్కొంటున్నాయి. వర్షాల కొరతతో సాగు గణాంకాలు గత ఏడాదితో పోలిస్తే తగ్గిపోగా, పంటల నష్టంపై ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి సారించింది. రాష్ట్రంలోని 315 మండలాల్లో కరవు ప్రభావం ఉన్నట్లు అధికారులు అంచనా వేసిన నేపథ్యంలో రైతులకు ఆర్థిక తోడ్పాటు అందించే దిశగా చర్యలు ప్రారంభమయ్యాయి. ఈ మేరకు రూ.1,986.89 కోట్లతో సహాయ ప్యాకేజీని ప్రభుత్వం ప్రతిపాదించింది.

2లో

**హైదరాబాద్, అక్టోబర్ 18 (నేటి ప్రస్థానం):** ప్రభుత్వానికి అధికారులు సమర్పించిన వివరాల ప్రకారం, కరవు తీవ్రతను బట్టి మండలాలను రెండు విభాగాలుగా

# ఏపీలో మధ్యప్రదేశ్ సీఎం..



## చంద్రబాబుతో అమరావతి ముచ్చట్లు..

- పవన్‌తో వన్యప్రాణుల పరిరక్షణపై చర్చలు
- ఏపీలో పర్యటించిన మధ్యప్రదేశ్ సీఎం మోహన్ యాదవ్
- సీఎం చంద్రబాబుతో మర్యాదపూర్వకంగా భేటీ
- మంగళగిరిలో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌తో సమావేశం
- చంద్రబాబుతో రాజధాని, రాష్ట్రాభివృద్ధి ప్రణాళికలపై సమావేశం
- పులుల సంరక్షణ, అడవి దున్నల తరలింపుపై ఇరువురి మధ్య చర్చ
- యువగళం పాదయాత్ర పుస్తకాన్ని అందించిన మంత్రి నారా లోకేశ్
- త్వరలో మధ్యప్రదేశ్‌లో పర్యటిస్తానని వెల్లడించిన పవన్ కల్యాణ్

2లో

అమరావతి, అక్టోబర్ 17 (నేటి ప్రస్థానం): ఆంధ్రప్రదేశ్, మధ్యప్రదేశ్ రాష్ట్రాల మధ్య అభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ రంగాల్లో పరస్పర సహకారానికి సంబంధించి కీలక అంశాలు చర్చకు వచ్చాయి. మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి డాక్టర్ మోహన్ యాదవ్ శనివారం ఆంధ్రప్రదేశ్‌లో పర్యటించి సీఎం నారా చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌లతో విడివిడిగా సమావేశమయ్యారు. విజయవాడలో నిర్వహిస్తున్న దసరా ఉత్సవాలు, విజయవాడ ఉత్సవ్ 2.0 కార్యక్రమాలకు హాజరయ్యేందుకు వచ్చిన ఆయన ఈ భేటీల్లో పాల్గొన్నారు.

## ఢిల్లీ ఓటర్ల జాబితా నిరసనలపై ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు

- మోదీ ప్రభుత్వాన్ని లక్ష్యంగా చేసుకున్నాయా? విపక్షాలపై బీజేపీ ఎంపీ ఆరోపణలు
- సర్ వ్యతిరేక ఆందోళనలపై కొండా విశ్వేశ్వర్ రెడ్డి విమర్శలు
- సరిహద్దు ఎన్‌క్లేవ్‌ల సమస్యను ప్రస్తావిస్తూ అక్రమ వలసలపై వ్యాఖ్యలు
- ఓటు బ్యాంకు రాజకీయాల కోసమే వలసలను ప్రోత్సహించారని ఆరోపణలు
- సోషల్ మీడియా ఫాలోవర్ల పెరుగుదలపై కూడా సందేహాలు

**న్యూఢిల్లీ, అక్టోబర్ 17 (నేటి ప్రస్థానం):** ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వాన్ని రాజకీయంగా బలహీనపరిచేందుకు విపక్షాలు ప్రయత్నిస్తున్నాయని తెలంగాణ బీజేపీ ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి ఆరోపించారు. ఢిల్లీలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్)కు వ్యతిరేకంగా జరుగుతున్న నిరసనలను ఈ రాజకీయ పరిణామాలతో ముడిపెడుతూ ఆయన మాట్లాడారు. కొన్ని విదేశీ శక్తులు సైతం అధికార మార్పు లక్ష్యంతో పనిచేస్తున్నాయని పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన విడుదల చేసిన



## కరెంట్, నీళ్లు పొదుపుగా వాడాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సూచన

- మారుతున్న వాతావరణం.. వనరుల వినియోగంలో అప్రమత్తత అవసరం
- 20,000 మెగావాట్లకు చేరిన తెలంగాణ విద్యుత్ డిమాండ్
- ఎల్ నినో ప్రభావంతో వాతావరణంలో మార్పులు
- అక్టోబర్, నవంబర్‌లోనూ కొనసాగుతున్న వేడి
- కరెంట్, నీటిని ఆదా చేయాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సూచన



2లో

## రాష్ట్ర నీళ్లను తరలించే కుట్ర..

- చంద్రబాబు ప్లాన్‌కు రేవంత్ సహకారం: హరీశ్‌రావు
- గోదావరి--కావేరి అనుసంధాన ప్రతిపాదనపై హరీశ్‌రావు అభ్యంతరం
- దేవాదులలో పది మోటార్లకు మూడే పనిచేస్తున్నాయని వ్యాఖ్య
- చంద్రబాబు ప్రతిపాదనలకు రేవంత్ ప్రభుత్వం తోడ్పడుతోందని ఆరోపణ
- సాగునీటి నిర్వహణలో నిర్లక్ష్యం అంటూ ప్రభుత్వంపై విమర్శలు



నేటి ప్రస్థానం
తెలుగు దినపత్రిక

# రాష్ట్ర నీళ్లను తరలించే కుట్ర..



**హైదరాబాద్, అక్టోబర్ 18 (నేటి ప్రస్థానం):** రాష్ట్రంలోని సాగునీటి ప్రాజెక్టుల నిర్వహణ, గోదావరి జలాల వినియోగంపై తెలంగాణ ప్రభుత్వం స్పష్టమైన వైఖరి ప్రకటించాలని బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్‌రావు డిమాండ్ చేశారు. పొరుగు రాష్ట్రాల నుంచి వస్తున్న నదుల అనుసంధాన ప్రతిపాదనల విషయంలో తెలంగాణ ప్రయోజనాలను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని పేర్కొన్నారు. ఈ అంశంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యవహరిస్తున్న తీరుపై ఆయన పలు విమర్శలు చేశారు. తెలంగాణ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో హరీశ్‌రావు మాట్లాడుతూ, గోదావరి జలాలను ఇతర ప్రాంతాలకు మళ్లించేందుకు ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. గోదావరి--కావేరి అనుసంధాన ప్రణాళిక ద్వారా తెలంగాణ నీటిని తరలించే ప్రయత్నాలు జరుగుతున్నాయని, వాటికి రాష్ట్ర ముఖ్యమంత్రి సహకరిస్తున్నారని విమర్శించారు. తెలంగాణ నీటి హక్కులకు సంబంధించిన అంశంలో ప్రభుత్వం అప్రమత్తంగా వ్యవహరించాలని కోరారు. గోదావరి జలాల మళ్లింపునకు సంబంధించి గతంలోనూ పలు ప్రాజెక్టుల ప్రతిపాదనలు వచ్చాయని హరీశ్‌రావు గుర్తుచేశారు. గోదావరి--బనకచర్ల, గోదావరి--నల్లమలసాగర్ ప్రణాళికలు ముందుకు సాగలేదని చెప్పారు. ఇప్పుడు గోదావరి--కావేరి అనుసంధానం పేరుతో మరో ప్రతిపాదన చర్చకు వస్తోందని, దీనిపై రాష్ట్ర ప్రభుత్వం తన అభిప్రాయాన్ని స్పష్టంగా వెల్లడించాలని అన్నారు. మరోవైపు, దేవాదుల ప్రాజెక్టు పనితీరుపైనా ఆయన ప్రశ్నలు లేవనెత్తారు. ప్రాజెక్టులో పది మోటార్లు ఉండగా మూడింటినే నడిపిస్తున్నారని పేర్కొన్నారు. ఈ పరిస్థితిపై తమ పార్టీ అభ్యంతరాలు వ్యక్తం చేసిన తర్వాతే ప్రభుత్వం స్పందించిందని అన్నారు. సాగునీటి ప్రాజెక్టుల ద్వారా అందుబాటులో ఉన్న నీటిని రైతులకు సక్రమంగా అందించే విషయంలో ప్రభుత్వం చొరవ చూపాలని సూచించారు. రాష్ట్రంలో కరవు పరిస్థితులపై స్పందిస్తూ, వాటికి ప్రభుత్వమే బాధ్యత వహించాలని హరీశ్‌రావు ఆరోపించారు. ఎల్‌నినో ప్రభావాన్ని చూపిస్తూ పాలకులు బాధ్యత నుంచి తప్పించుకునే ప్రయత్నం చేయకూడదని వ్యాఖ్యానించారు. సాగునీటి నిర్వహణలో లోపాల కారణంగా రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని విమర్శించారు. వర్షపాతం అంశాన్ని ప్రస్తావించిన ఆయన, తెలంగాణ కంటే ఆంధ్రప్రదేశ్‌లో తక్కువ వర్షాలు నమోదైనప్పటికీ అక్కడ పంటల సాగును నిలిపివేయాల్సిన పరిస్థితి లేదని పేర్కొన్నారు. తెలంగాణలో మాత్రం రైతులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఈ పరిస్థితులపై ప్రభుత్వం సమీక్షించి సాగునీటి సరఫరాను మెరుగుపర్చేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఏపీ నాయకులు ఇలాంటి నదుల అనుసంధాన ప్రతిపాదనలు చేయలేదని హరీశ్‌రావు పేర్కొన్నారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాతే కొత్త ప్రతిపాదనలు తెరపైకి వస్తున్నాయని ఆరోపించారు. తెలంగాణకు సంబంధించిన నీటి ప్రయోజనాలను పరిరక్షించడంలో ప్రభుత్వం విఫలమవుతోందని విమర్శించారు.

## ఢిల్లీ ఓటర్ల జాబితా నిరసనలపై ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు

(మొదటి పేజీ తరువాయి)

వీడియో సామాజిక మాధ్యమాల్లో ప్రచారంలో ఉంది. భారత్--బంగ్లాదేశ్ సరిహద్దుల్లో గతంలో ఉన్న ఎన్‌క్లేవ్‌ల వ్యవస్థను ప్రస్తావిస్తూ ఎంపీ పలు అంశాలను వివరించారు. 2015కు ముందు బంగ్లాదేశ్ పరిధిలో భారత్‌కు చెందిన 111 ఎన్‌క్లేవ్‌లు, భారత్‌లో బంగ్లాదేశ్‌కు చెందిన 51 ఎన్‌క్లేవ్‌లు ఉండేవని తెలిపారు. ఆ ప్రాంతాల్లో నివసించే ప్రజలు పౌరసత్వ గుర్తింపు, ప్రభుత్వ సంక్షేమ సేవలు పొందడంలో ఇబ్బందులు ఎదుర్కొనేవారని చెప్పారు. 2015లో కేంద్ర ప్రభుత్వం కుదుర్చుకున్న భూ సరిహద్దు ఒప్పందం ద్వారా ఈ సమస్య పరిష్కారమైందని విశ్వేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు. అప్పట్లో సరిహద్దుల స్వరూపం సంక్లిష్టంగా ఉండటం వల్ల అక్రమ వలసలకు అవకాశం ఏర్పడిందని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ పరిణామాలను కొన్ని రాజకీయ పార్టీలు తమ ఓటు బ్యాంకును పెంచుకునేందుకు ఉపయోగించుకున్నాయని ఆరోపించారు. పశ్చిమ బెంగాల్‌లో తృణమూల్ కాంగ్రెస్, అసోంలో కాంగ్రెస్ అక్రమ వలసలను ప్రోత్సహించాయని ఎంపీ విమర్శించారు. ఈ పరిస్థితుల ప్రభావం హైదరాబాద్‌తో పాటు ఢిల్లీ, బీహార్, ఒడిశా ప్రాంతాలపై కూడా పడిందని అన్నారు. ప్రస్తుతం ఎన్నికల సంఘం ఓటర్ల జాబితా సవరణ చేపడుతున్న నేపథ్యంలో దానికి వ్యతిరేకంగా ఆందోళనలు చేయడం వెనుక రాజకీయ ప్రయోజనాలు ఉన్నాయని ఆరోపించారు. విపక్ష పార్టీల మధ్య పలు విధానపరమైన అంశాల్లో ఏకాభిప్రాయం లేదని విశ్వేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు. నీట్, యూపీఐ, ఎన్నికల సంఘం వంటి విషయాలపై భిన్నమైన వైఖరులు ఉన్నప్పటికీ, మోదీని అధికారానికి దూరం చేయాలనే లక్ష్యంతో అవి కలిసి పనిచేస్తున్నాయని విమర్శించారు. విపక్షాల మధ్య ఉన్న రాజకీయ భేదాల కంటే ఈ లక్ష్యానికే ప్రాధాన్యం ఇస్తున్నాయని ఆయన వ్యాఖ్యానించారు. ఆమ్ ఆద్మీ పార్టీకి చెందిన ఒక నాయకుడి ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో తక్కువ సమయంలో లక్షలాది మంది ఫాలోవర్లు పెరగడంపైనా ఎంపీ అనుమానాలు వ్యక్తం చేశారు.

# కరవు కోరల్లో తెలంగాణ..

గుర్తించారు. 101 మండలాల్లో తీవ్రమైన పరిస్థితులు ఉండగా, మరో 214 మండలాల్లో మోస్తరు స్థాయి ప్రభావం ఉన్నట్లు నివేదించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన జరిగిన అనధికారిక క్యాబినెట్ సమావేశంలో రాష్ట్రంలో నెలకొన్న వ్యవసాయ పరిస్థితులు, రైతులకు అందించాల్సిన సహాయం, కరవు నిర్వహణపై చర్చించారు. ఈ ఏడాది వర్షపాతం సాధారణ స్థాయిని అందుకోలేకపోయింది. జూన్ 1 నుంచి సెప్టెంబర్ 30 వరకు 740.6 మిల్లీమీటర్ల వర్షం నమోదు కావాల్సి ఉండగా, వాస్తవంగా 615.5 మిల్లీమీటర్లే కురిసింది. అక్టోబర్ 15 నాటికి వర్షపాత లోటు 23 శాతానికి చేరింది. ఎల్ నినో ప్రభావంతో వర్షాలు తగ్గడం వ్యవసాయ రంగంపై ప్రతికూల ప్రభావం చూపినట్లు ప్రభుత్వం గుర్తించింది. వర్షాభావ పరిస్థితుల ప్రభావం సాగు విస్తీర్ణంలోనూ స్పష్టంగా కనిపించింది. గత ఏడాదితో పోల్చినప్పుడు ఈసారి సాగు విస్తీర్ణం 13.22 లక్షల ఎకరాలు తగ్గి 126.06 లక్షల ఎకరాలకు పరిమితమైంది. జిల్లాలవారీగా పరిశీలిస్తే నల్గొండలో పంట నష్టం అధికంగా నమోదైంది. అక్కడ 3.58 లక్షల ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నట్లు గణాంకాలు సూచిస్తున్నాయి. నష్టపోయిన రైతులను ఆదుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం సహాయ ప్యాకేజీని రూపొందించింది. కరవు ప్రభావంతో రైతులకు ఎదురవుతున్న ఇబ్బందులను కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లిన వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రాష్ట్రానికి తక్షణ ఆర్థిక సహకారం అందించాలని కోరారు. కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ అధ్యక్షతన శుక్రవారం జరిగిన 'ఖేత్ బచావో అభియాన్' వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న ఆయన, సూక్ష్మ సేద్యం ప్రోత్సాహానికి, మధ్యంతర పంటల విత్తనాల పంపిణీకి అవసరమైన నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. రైతులు పండించిన మొక్కజొన్న, జొన్న తదితర పంటలను మద్దతు ధరకు పూర్తిస్థాయిలో కొనుగోలు చేయాలని తుమ్మల కోరారు. ధరల మద్దతు పథకం కింద ప్రస్తుతం అమలవుతున్న 25 శాతం కొనుగోలు పరిమితిని తొలగించాలని సూచించారు. రసాయన ఎరువుల ధరలు, వాటిపై అందించే సబ్సిడీలను హేతుబద్ధంగా సర్దుబాటు చేయాలని, వ్యవసాయ కూలీలకు ఉపాధి కల్పించే విషయంలో ప్రాధాన్యం ఇవ్వాలని కేంద్రానికి విజ్ఞప్తి చేశారు. వ్యవసాయంతో పాటు తాగునీటి అవసరాలపైనా ప్రభుత్వం అప్రమత్తమవుతోంది. రాష్ట్రంలోని ప్రధాన జలాశయాలన్నింటి పూర్తి నిల్వ సామర్థ్యం 466 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 209.45 టీఎంసీల నీరు మాత్రమే ఉంది. నీటి లభ్యత తగ్గినందున తాగునీటి సరఫరాకు ప్రాధాన్యం ఇవ్వాలని, సాగునీటి విడుదల విషయంలో పరిమిత విధానాన్ని అనుసరించాలని అధికారులు సిఫార్సు చేశారు. పంట నష్టానికి గురైన రైతులకు అండగా నిలిచేందుకు రూ.1,986.89 కోట్ల సహాయ ప్యాకేజీని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించింది. కరవును అధికారికంగా ప్రకటించే ప్రక్రియతో పాటు కేంద్రం నుంచి గరిష్ఠ సహాయం పొందేందుకు అవసరమైన నివేదికను సిద్ధం చేస్తోంది. కేంద్ర సాయం, పంటల కొనుగోళ్లపై నిర్ణయాలు, నీటి వినియోగంపై తీసుకునే చర్యలు రానున్న రోజుల్లో రాష్ట్ర వ్యవసాయ రంగానికి కీలకం కానున్నాయి.

# ఏపీలో మధ్యప్రదేశ్ సీఎం..

(మొదటి పేజీ తరువాయి)

ఉండవల్లిలోని తన నివాసంలో మోహన్ యాదవ్‌తో చంద్రబాబు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్‌లో అమలు చేయనున్న అభివృద్ధి కార్యక్రమాలు, రాజధాని అమరావతి నిర్మాణానికి సంబంధించిన ప్రణాళికలను వివరించారు. రాష్ట్ర సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలు, భవిష్యత్ కార్యాచరణపై ఇరువురు నేతలు మాట్లాడుకున్నారు. రెండు రాష్ట్రాల మధ్య సత్సంబంధాలను మరింత పటిష్ఠం చేసుకునే అంశానికి ఈ సమావేశంలో ప్రాధాన్యం లభించింది. మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రికి మంత్రి నారా లోకేశ్ స్వాగతం పలికి సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా తన యువగళం పాదయాత్ర అనుభవాలతో రూపొందించిన పుస్తకాన్ని మోహన్ యాదవ్‌కు అందజేశారు. పాదయాత్రలో ప్రజలతో మమేకమైన సందర్భాలు, వివిధ ప్రాంతాల్లో గుర్తించిన సమస్యలు, ప్రజల అభిప్రాయాల గురించి వివరించారు.

**వన్యప్రాణుల పరిరక్షణకు ప్రాధాన్యం**

మంగళగిరిలోని ఉప ముఖ్యమంత్రి కార్యాలయంలో పవన్ కల్యాణ్‌తో మోహన్ యాదవ్ సమావేశమయ్యారు. నాగార్జునసాగర్–శ్రీశైలం టైగర్ రిజర్వ్ పరిధిలో పులుల రక్షణ చర్యలను మరింత బలోపేతం చేసే అంశంపై ఇరువురు చర్చించారు. అటవీ ప్రాంతాల్లో జీవవైవిధ్యాన్ని పరిరక్షించేందుకు చేపట్టాల్సిన చర్యలపైనా సమాలోచనలు జరిపారు. మధ్యప్రదేశ్ నుంచి గౌర్ (అడవి దున్నలు)ను నాగార్జునసాగర్–శ్రీశైలం టైగర్ రిజర్వ్‌కు తరలించేందుకు సంబంధించిన ఒప్పందాన్ని వేగవంతం చేయాలని పవన్ కల్యాణ్ కోరారు. ఈ ప్రక్రియ ముందుకు సాగేందుకు అవసరమైన చర్యలకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. త్వరలో మధ్యప్రదేశ్‌లో పర్యటించనున్నట్లు కూడా పవన్ తెలిపారు.

**సంప్రదాయ కళాకృతుల బహూకరణ**

సమావేశం ముగిసిన అనంతరం పవన్ కల్యాణ్ మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి మోహన్ యాదవ్‌ను ఉప్పాడ పట్టు శాలువాతో సత్కరించారు. రాష్ట్రానికి ప్రత్యేక గుర్తింపు తెచ్చిన కొండపల్లి, శ్రీకాళహస్తి కళాకృతులతో పాటు అరకు కాఫీని బహూకరించారు. మోహన్ యాదవ్ సైతం శ్రీ ఓంకారేశ్వర స్వామి ప్రతిమను, జ్యోతిర్లింగ క్షేత్ర ప్రసాదాన్ని పవన్ కల్యాణ్‌కు అందించారు. చంద్రబాబు, పవన్ కల్యాణ్‌లతో జరిగిన ఈ సమావేశాల్లో రాష్ట్రాభివృద్ధి, అంతర్రాష్ట్ర సహకారం, వన్యప్రాణుల సంరక్షణ వంటి అంశాలు ప్రధానంగా చర్చకు వచ్చాయి.

## పులివెందులలో ఎన్నికల వేడి!

(మొదటి పేజీ తరువాయి)

పులివెందుల: స్థానిక సంస్థల ఎన్నికల నామినేషన్ల సందర్భంగా కడప జిల్లా పులివెందులలో ఉద్రిక్తత చోటుచేసుకుంది. నామినేషన్ కేంద్రం వద్ద వైసీపీ, టీడీపీ కార్యకర్తల మధ్య వాగ్వాదం, తోపులాట జరగడంతో పరిస్థితిని అదుపులోకి తీసుకురావడానికి పోలీసులు గాల్లోకి కాల్పులు జరిపారు. ఆరు రౌండ్లు కాల్పులు జరిగినట్లు సమాచారం. నామినేషన్లు దాఖలు చేసేందుకు వైసీపీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో కేంద్రానికి చేరుకున్నారు. అక్కడ ఉన్న టీడీపీ నాయకులను ముందుగా లోపలికి అనుమతిస్తామని పోలీసులు చెప్పడంతో వైసీపీ శ్రేణులు అభ్యంతరం వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో కొందరు కార్యకర్తలు ముందుకు వెళ్లేందుకు ప్రయత్నించడంతో ఇరువర్గాల మధ్య తోపులాట చోటుచేసుకుంది. పరిస్థితి అదుపు తప్పే అవకాశం ఉండటంతో పోలీసులు జోక్యం చేసుకున్నారు. గుమిగూడిన వారిని చెదరగొట్టి శాంతిభద్రతలను కాపాడేందుకు గాల్లోకి కాల్పులు జరిపారు. ఈ ఘటనలో ఎవరూ గాయపడలేదని అధికారులు తెలిపారు. ఘటన అనంతరం నామినేషన్ కేంద్రం పరిసరాల్లో పోలీసులు భద్రతను కట్టుదిట్టం చేశారు. అదనపు సిబ్బందిని మోహరించి పరిస్థితిని పర్యవేక్షించారు. ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా కొనసాగేందుకు చర్యలు చేపట్టారు. నామినేషన్ల సమయంలో చోటుచేసుకున్న ఈ పరిణామంతో పులివెందులలో కొద్దిసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది.

## దాండియా సంబరాల్లో అపశ్రుతి

(మొదటి పేజీ తరువాయి)

హైదరాబాద్‌లోని నాదర్‌గుల్ ప్రాంతంలో ఉన్న ఎంవీఎస్ఆర్ ఇంజనీరింగ్ కాలేజీలో శనివారం రాత్రి ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. కాలేజీలో నిర్వహిస్తున్న 'సంగమం–2026' టెక్నికల్ మరియు కల్చరల్ ఫెస్ట్‌లో భాగంగా ఏర్పాటు చేసిన దాండియా వేడుకల్లో విషాదం నిండింది. వేడుకల కోసం ఏర్పాటు చేసిన భారీ ఇనుప విద్యుత్ దీపాల స్టాండ్ (ాఅస్త్రష్ట్రఅస్త్ర ఽతీబంం) ఒక్కసారిగా విద్యార్థులపై కుప్పకూలింది. ఈ ప్రమాదంలో వనపర్తి జిల్లాకు చెందిన బీటెక్ విద్యార్థిని సోనీ అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయింది. ఆమెతో పాటు మరో 25 మంది విద్యార్థులు తీవ్రంగా గాయపడ్డారు. గాయపడిన వారిలో మృతురాలి సోదరితో సహా ఐదుగురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. ప్రమాదం జరిగిన వెంటనే అప్రమత్తమైన సిబ్బంది బాధితులను ఎల్బీ నగర్‌లోని కామినేని ఆసుపత్రికి, అలాగే అదభట్లలోని ఇతర ప్రైవేట్ ఆసుపత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నారు. భారీ ఈదురుగాలుల కారణంగానే లైటింగ్ క్రేన్ అదుపుతప్పి కూలిపోయినట్లు ప్రాథమిక సమాచారం అందుతోంది. స్టాండ్ కూలిన సమయంలో మంటలు కూడా చెలరేగడంతో విద్యార్థులు ప్రాణభయంతో పరుగులు తీశారు. ఈ ఘటనపై తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతి చెందిన విద్యార్థిని కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. గాయపడిన విద్యార్థులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని అధికారులను ఆదేశించారు. ఈ ఘటనపై పూర్తిస్థాయి విచారణ జరిపి, నిర్లక్ష్యానికి బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సీఎం స్పష్టం చేశారు.

## తెలంగాణకు రేపటి నుంచి వర్ష సూచన..

తెలంగాణలో రానున్న రోజుల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ వెల్లడించింది. రేపు, ఎల్లుండి రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు పడతాయని, కొన్నిచోట్ల ఉరుములు, మెరుపులతో కూడిన జల్లులు కురిసే అవకాశముందని తెలిపింది. ఈ మేరకు హైదరాబాద్ వాతావరణ కేంద్రం పలు జిల్లాలకు ఎల్లో వార్నింగ్ జారీ చేసింది. ఉత్తర తమిళనాడు, దానిని ఆనుకుని ఉన్న దక్షిణ కోస్తాంధ్ర ప్రాంతాల్లో సముద్ర మట్టానికి 4.5 నుంచి 5.8 కిలోమీటర్ల ఎత్తులో ఉపరితల ఆవర్తనం కొనసాగుతోంది. దీని ప్రభావంతో తెలంగాణలో రానున్న మూడు రోజుల పాటు వర్షాలు కురుస్తాయని అధికారులు అంచనా వేస్తున్నారు. వర్షంతో పాటు గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురుగాలులు కూడా వీచే అవకాశం ఉందని హెచ్చరించారు. రేపు (అక్టోబర్ 18) హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజ్‌గిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, మహబూబ్‌నగర్, నల్గొండ, సూర్యాపేట, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం సహా పలు జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేశారు. వర్షాల నేపథ్యంలో, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వాతావరణ శాఖ అధికారులు సూచించారు.

### నవంబర్ రెండో వారంలో అందరం కలుద్దాం...

## గెట్ రెడీ!: విజయసాయిరెడ్డి

ఆంధ్రప్రదేశ్ రాజకీయాలపై రాజ్యసభ మాజీ సభ్యుడు విజయసాయిరెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రంలో టీడీపీ, వైసీపీల మధ్య పౌర యుద్ధం (సివిల్ వార్) నడుస్తోందని, రెండు కుటుంబాలు పోషిస్తున్న ఫ్యాక్షన్ల మధ్య ఘర్షణలు జరుగుతున్నాయని ఆరోపిస్తూ సోషల్ మీడియాలో ఒక పోస్ట్ పెట్టారు. గత రెండు రోజులుగా పుంగనూరు, రాయచోటి, తాడిపత్రి, ఆళ్లగడ్డ వంటి పట్టణాల్లో జరుగుతున్న హింసాత్మక ఘటనలను విజయసాయిరెడ్డి తన పోస్టులో ప్రస్తావించారు. "రెడ్ బుక్ వర్సెస్ రప్ప రప్ప రాజకీయం నడుస్తోంది. చంద్రబాబు, జగన్ కుటుంబాల మధ్య, ఆ రెండు కుల, మైనారిటీ కుటుంబాలు పోషిస్తున్న ఫ్యాక్షన్ల మధ్య ఓ సివిల్ వార్ నడుస్తోంది" అని ఆయన ఘాటుగా వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు ఎంత దారుణంగా ఉన్నాయో ఈ ఘటనలే నిదర్శనమని అన్నారు. కర్రలు, కత్తులు, గూండాలు, బౌన్సర్లు, నామినేషన్లు చించివేయడం, జీపులతో ఢీకొట్టడం, నెత్తురోడేలా దాడులు చేసుకోవడం వంటి దృశ్యాలు దేశవ్యాప్తంగా రాష్ట్ర పరువును తీస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇదే అరాచకం కొనసాగితే, 2029 నాటి సాధారణ ఎన్నికల్లో ఈ పార్టీలు నేరుగా బందిపోట్లకు, హత్యలు, మానభంగాలు, దొంగతనాల చరిత్ర ఉన్నవారికే టికెట్లు ఇచ్చే పరిస్థితి వస్తుందని ఆయన జోస్యం చెప్పారు. ఈ రెండు పార్టీలకు గుణపాఠం చెప్పాల్సిన సమయం ఆసన్నమైందని, ఒక మూడో ప్రత్యామ్నాయంతో సరికొత్త రాజకీయానికి యువత (జెన్–జీ) నడుం బిగించాలని పిలుపునిచ్చారు. "ఈ అరాచకం ఇకమీదటా కొనసాగాలా? లేక, ఈ రెండు పార్టీలకు గుణపాఠం నేర్పాలా? అన్నది నిర్ణయించుకోవాలి. నవంబర్ రెండో వారంలో అందరం కలుద్దాం... గెట్ రెడీ!" అంటూ తన పోస్టును ముగించారు.

## కరెంట్, నీళ్లు పొదుపుగా వాడాలని

## డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సూచన

హైదరాబాద్: సహజ వనరుల పరిరక్షణలో ప్రజల భాగస్వామ్యం అవసరమని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. తెలంగాణలో మారిన వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో విద్యుత్, నీటి వినియోగంపై ప్రతి ఒక్కరూ జాగ్రత్త వహించాలని సూచించారు. అవసరానికి మించి వినియోగించకుండా పొదుపు పద్ధతులను పాటించాలని కోరారు. రాష్ట్రంలో విద్యుత్ అవసరాలు పెరుగుతున్నాయని, ప్రస్తుతం డిమాండ్ సుమారు 20,000 మెగావాట్లకు చేరిందని భట్టి విక్రమార్క వెల్లడించారు. ఉష్ణోగ్రతలు అధికంగా నమోదవుతుండటంతో విద్యుత్ వినియోగం పెరిగినట్లు వివరించారు. వాతావరణ పరిస్థితులు ప్రతికూలంగా మారుతున్న సమయంలో అందుబాటులో ఉన్న వనరులను సమర్థంగా వినియోగించుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. కాలానుగుణంగా ఉండాల్సిన వాతావరణంలో మార్పులు కనిపిస్తున్నాయని ఉప ముఖ్యమంత్రి తెలిపారు. గతంలో అక్టోబర్, నవంబర్ నెలల్లో చలి తీవ్రత ఎక్కువగా ఉండేదని, ప్రస్తుతం ఆ పరిస్థితికి భిన్నంగా ఎండల ప్రభావం కనిపిస్తోందని చెప్పారు. గతంలో చలి నుంచి రక్షణ పొందేందుకు ప్రయత్నించేవాళ్లమని, ఇప్పుడు వేడి నుంచి ఉపశమనం పొందాల్సి వస్తోందని వ్యాఖ్యానించారు. ఎల్ నినో ప్రభావంతో పాటు వాతావరణ మార్పుల కారణంగా పరిస్థితులు మారుతున్నాయని భట్టి విక్రమార్క అభిప్రాయపడ్డారు. ఈ మార్పులు విద్యుత్, నీటి అవసరాలపై ప్రభావం చూపుతున్న నేపథ్యంలో ప్రజలు తమ వినియోగ అలవాట్లను సమీక్షించుకోవాలని సూచించారు. వనరులను బాధ్యతతో వినియోగించడం ద్వారా వాటిపై ఒత్తిడిని తగ్గించవచ్చని పేర్కొన్నారు. శనివారం హైదరాబాద్‌లో నిర్వహించిన 'బతుకమ్మ యంగ్ ఫిల్మ్ మేకర్స్ అవార్డ్స్' కార్యక్రమానికి ఉప ముఖ్యమంత్రి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వివిధ విభాగాల్లో విజయం సాధించిన వారికి పురస్కారాలు అందజేశారు. అనంతరం మాట్లాడిన ఆయన, ప్రస్తుత వాతావరణ పరిస్థితులపై తన అభిప్రాయాలను వెల్లడిస్తూ విద్యుత్, నీటి పొదుపుపై ప్రజలకు పిలుపునిచ్చారు. విద్యుత్ వినియోగం పెరుగుతున్న తరుణంలో అవసరం లేని సమయంలో లైట్లు, ఇతర విద్యుత్ పరికరాలను ఉపయోగించకుండా ఉండటం వంటి పొదుపు చర్యలకు ప్రాధాన్యం ఇవ్వాలని ఆయన విజ్ఞప్తి చేశారు. నీటి విషయంలోనూ వృథాను అరికట్టి, అవసరాలకు అనుగుణంగా వినియోగించుకోవాలని సూచించారు. వాతావరణంలో వస్తున్న మార్పులను దృష్టిలో పెట్టుకుని సహజ వనరుల విషయంలో నిర్లక్ష్యం తగదని స్పష్టం చేశారు.



## గ్రామ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తాం:- సర్పంచ్ నర్సుగారి కృష్ణ

**గ్రామంలోని ప్రతి సమస్యను గుర్తించి పరిష్కారానికి చర్యలు.. వివిధ ప్రాంతాల్లో మరమ్మతు పనులు**



**మనోహరాబాద్ నేటి ప్రస్థానం:-** మనోరాబాద్ మండలం జీడిపల్లి గ్రామ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తూ, గ్రామాన్ని అన్ని రంగాల్లో ప్రథమ స్థానంలో నిలిపేందుకు శక్తివంచన లేకుండా పనిచేస్తామని సర్పంచ్ నర్సుగారి కృష్ణ తెలిపారు. గ్రామంలో ప్రజలు ఎదుర్కొంటున్న ప్రతి సమస్యను గుర్తించి, వాటి పరిష్కారానికి ప్రాధాన్యతనిస్తామని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా శనివారం గ్రామంలోని వివిధ ప్రాంతాల్లో పర్యటించి, అక్కడ నెలకొన్న సమస్యలను గుర్తించారు. ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్న సమస్యలను పరిశీలించి, అవసరమైన మరమ్మతు పనులు చేపట్టారు. గ్రామంలో మౌలిక సదుపాయాలను మెరుగు పరచడంతో పాటు, ప్రజలకు మెరుగైన వసతులు కల్పించేందుకు కృషి చేస్తామని సర్పంచ్ తెలిపారు. గ్రామ అభివృద్ధి అనేది ఒక్కరోజుతో పూర్తయ్యే ప్రక్రియ కాదని, ప్రజాప్రతినిధులు, అధికారులు, గ్రామస్తుల సమన్వయంతో నిరంతరం కొనసాగాల్సిన బాధ్యత అని పేర్కొన్నారు. గ్రామంలో ఏ సమస్య ఉన్నా తమ దృష్టికి తీసుకురావాలని, వాటిని పరిశీలించి పరిష్కరించేందుకు కృషి చేస్తామని గ్రామ ప్రజలకు భరోసా ఇచ్చారు. గ్రామాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లడంతో పాటు అన్ని రంగాల్లో ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు. గ్రామంలో మౌలిక సదుపాయాల కల్పన, ప్రజా సమస్యల పరిష్కారం, అవసరమైన మరమ్మతు పనుల నిర్వహణకు ప్రాధాన్యతనిస్తూ ముందుకు సాగుతామని సర్పంచ్ నర్సు కృష్ణ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్, పాలకవర్గ సభ్యులు, గ్రామ కార్యదర్శి సత్యనారాయణ, కారోబార్ హబీబ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

## గుండ్లపోచంపల్లి 299 డివిజన్ ఎస్సి సెల్ ప్రెసిడెంట్ గా కుండ భానుచందర్

**రెండోసారి ఎస్సీ సెల్ ప్రెసిడెంట్‌గా ఎన్నిక చేసినందుకు కృతజ్ఞతలు**




**మేడ్చల్ నేటి ప్రస్థానం:-** గుండ్లపోచంపల్లి 299 డివిజన్ కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ ప్రెసిడెంట్‌గా రెండవసారి ఎన్నికైన సందర్భంగా కుండ భానుచందర్ ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనను నమ్మి మరోసారి బాధ్యతలు అప్పగించిన పార్టీ నాయకులకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. తనపై నమ్మకం ఉంచి రెండవసారి ఎస్సీ సెల్ ప్రెసిడెంట్‌గా అవకాశం కల్పించిన మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తోటకూర వజ్రేష్ యాదవ్ మేడ్చల్ మాజీ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డికి, హరివర్ధన్ రెడ్డికి, నక్క ప్రభాకర్ గౌడ్ కి, మేడ్చల్ జిల్లా ఎస్సీ సెల్ చైర్మన్ కావలి చెన్నయ్య, టీపీసీసీ ఎస్సీ సెల్ జనరల్ సెక్రటరీ మురళీ అన్న, మేడ్చల్ ఏ బ్లాక్ మాజీ అధ్యక్షులు పానుగంటి మహేష్ కు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. తనకు ఈ బాధ్యతను అప్పగించిన నాయకుల నమ్మకాన్ని తప్పకుండ నిలబెట్టుకుంటూ, గుండ్లపోచంపల్లి 299 డివిజన్ లో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి, అలాగే ఎస్సీ సెల్ అభివృద్ధికి కృషి చేస్తానని కుండా భానుచందర్ అన్నారు, 29 డివిజన్లో ప్రజా సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని కూడ పేర్కొన్నారు. తన ఎన్నికకు సహకరించిన కాంగ్రెస్ పార్టీ నాయకులకు, కార్యకర్తలకు, అభిమానులకు, శ్రేయోభిలాషులకు మరియు ప్రతి ఒక్కరికీ హృదయపూర్వక ధన్యవాదాలు తెలియ చేస్తున్నట్లు కుండ భానుచందర్ తెలిపారు. భవిష్యత్తులో కూడా నా పైన అందరి సహకారం, ఆశీస్సులు ఉండాలని కుండ భానుచందర్ కోరారు.







## దోమడుగులో వైభవంగా మహాలక్ష్మి హోమం

**మాజీ ఎంపీటీసీ గోవర్ధన్ గౌడ్ ఆధ్వర్యంలో దేవి నవరాత్రి వేడుకలు**

**భక్తులకు మహా అన్నప్రసాద వితరణ..**

**ప్రత్యేక పూజల్లో పాల్గొన్న జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కాటా సుధా శ్రీనివాస్ గౌడ్**





**గుమ్మడిదల, అక్టోబర్ 17 (నేటి ప్రస్థానం):** గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలోని దోమడుగు గ్రామంలో దేవి నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. మాజీ ఎంపీటీసీ, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు గోవర్ధన్ గౌడ్ ఆధ్వర్యంలో గత పదేళ్లుగా నిర్వహిస్తున్న ఈ వేడుకల్లో భాగంగా శనివారం దుర్గమ్మ సన్నిధిలో మహాలక్ష్మి హోమాన్ని వైభవంగా నిర్వహించారు. ప్రత్యేక పూజలు, హోమ కార్యక్రమాలతో ఆలయ ప్రాంగణం భక్తులతో సందడిగా మారింది. ఈ కార్యక్రమానికి సంగారెడ్డి జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కాటా సుధా శ్రీనివాస్ గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు మహా అన్నప్రసాద వితరణ చేపట్టారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా గోవర్ధన్ గౌడ్ మాట్లాడుతూ, దుర్గమ్మ ఆశీస్సులతో మున్సిపాలిటీ ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని, ప్రతి ఒక్కరికీ కష్టసుఖాల్లో అండగా నిలిచి ధైర్యాన్ని ప్రసాదించాలని ఆకాంక్షించారు. ప్రజల శ్రేయస్సు, గ్రామాభివృద్ధి కోసం అమ్మవారి ఆశీస్సులు ఉండాలని ప్రార్థించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ పరమేశం, గుమ్మడిదల ఎస్ఐ అరుణ్ కుమార్ గౌడ్, మున్సిపల్ చైర్మన్ చిన్నపాపని కుమార్ గౌడ్, ఆత్మ కమిటీ చైర్మన్ కొత్తపల్లి శ్రీనివాస్ రెడ్డి, మాజీ ఎంపీపీ రవీందర్ గౌడ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పుట్ట నర్సింగ్ రావు, వీరభద్రస్వామి దేవాలయ కమిటీ మాజీ చైర్మన్ మద్ది ప్రతాప్ రెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు చిమ్ముల గోవర్ధన్ రెడ్డి, నాయకులు మద్ది వీరారెడ్డి, పొన్నాల శ్రీనివాస్ రెడ్డి, తులసీదాస్, మంగయ్య, వెంకట్రాం రెడ్డి, తుపాకుల రాజు, వార్డు కౌన్సిలర్లు అభిశెట్టి రాజశేఖర్, మద్ది సోనీ శేఖర్ రెడ్డి, బ్యాగరి వరలక్ష్మి కృష్ణ, సురభి కుమార్ గౌడ్, కత్తుల రమేష్, భక్తులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## డబిల్‌పూర్‌లో వైభవంగా దుర్గామాత నవరాత్రి పూజలు

**చండీయాగంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించిన 23వ వార్డు కౌన్సిలర్ ఎండీ ఆరిఫ్**



**మేడ్చల్ నేటి ప్రస్థానం:-** ఎల్లంపేట మున్సిపాలిటీ పరిధిలోని దబిల్‌పూర్ గ్రామంలో శరన్నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొన సాగుతున్నాయి. నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గ్రామంలో కొలువుదీరిన దుర్గామాత అమ్మవారిని 23వ వార్డు కౌన్సిలర్ ఎండీ ఆరిఫ్ దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం చండీయాగంలో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా ఆలయంలో నిర్వహించిన పూజా కార్యక్రమాల్లో భక్తులు భక్తిశ్రద్ధలతో పాల్గొన్నారు. నవరాత్రి ఉత్సవాల సందర్భంగా గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. అమ్మవారి దర్శనం, ప్రత్యేక పూజలతో భక్తులు ఆధ్యాత్మిక ఆనందాన్ని పొందారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ ఎండీ ఆరిఫ్ మాట్లాడుతూ.. దుర్గామాత అమ్మవారి కృపాకటాక్షాలతో దబిల్‌పూర్ గ్రామ ప్రజలందరూ ఎల్లవేళలా సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. గ్రామంలో శాంతి, సౌభాగ్యం వెల్లివిరియాలని, ప్రజలందరికీ అమ్మవారి ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని ప్రార్థించినట్లు తెలిపారు. ప్రజలందరూ ఐకమత్యంతో, సంతోషంగా జీవించాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ డైరెక్టర్ మధు, మాజీ యువజన నాయకుడు సల్ల వెంకటేష్ యాదవ్, మేడ్చల్ మండల కాంగ్రెస్ పార్టీ సేవాదళ్ అధ్యక్షుడు దుడ్డు కుమార్ తదితరులు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.





## బతుకమ్మ వేడుకలకు సర్వం సిద్ధం

**చెరువుల ఘాట్లు, వేడుకల ప్రాంగణాల్లో ఏర్పాట్ల పరిశీలన**

**మహిళలకు ఇబ్బందులు కలగకుండా అన్ని చర్యలు చేపట్టాలి**

**మున్సిపల్ చైర్మన్ చిన్నపాపని కుమార్ గౌడ్**

**గుమ్మడిదల, అక్టోబర్ 17 ( నేటి ప్రస్థానం ):** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ వేడుకలను గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలో ఘనంగా నిర్వహించేందుకు అధికారులు అవసరమైన ఏర్పాట్లు చేపట్టారు. ఈ నేపథ్యంలో మున్సిపల్ చైర్మన్ చిన్నపాపని కుమార్ గౌడ్ కౌన్సిలర్లు, అధికారులతో కలిసి గుమ్మడిదల, బొంతపల్లి, దోమడుగు, అన్నారం, వీరన్నగూడెం గ్రామాల్లో బతుకమ్మ వేడుకలు నిర్వహించే ప్రాంగణాలు, నిమజ్జన చెరువు ఘాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా చెరువుల వద్ద నిమజ్జన ఏర్పాట్లు, విద్యుత్ దీపాల సౌకర్యం, పారిశుద్ధ్య నిర్వహణ తదితర అంశాలను సమీక్షించారు. బతుకమ్మ వేడుకల్లో పాల్గొనే మహిళలు, భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని సంబంధిత అధికారులను చైర్మన్ ఆదేశించారు. చెరువు ఘాట్ల వద్ద భద్రతకు ప్రాధాన్యం ఇవ్వడంతోపాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. పండుగకు ముందే అన్ని పనులు పూర్తి చేసి, వేడుకలు ప్రశాంతంగా జరిగేలా సమన్వయంతో పనిచేయాలని అధికారులకు స్పష్టం చేశారు. ఏర్పాట్లలో ఎలాంటి నిర్లక్ష్యం వహించకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ దశరథ్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు చిమ్ముల గోవర్ధన్ రెడ్డి, వార్డు కౌన్సిలర్లు, వివిధ పార్టీల నాయకులు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## 11వ వార్డులో సీసీ రోడ్ల నిర్మాణ పనుల పరిశీలన

**ప్రజల అవసరాలే ప్రాధాన్యంగా అభివృద్ధి పనులు**

**నిర్మాణాల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి: మున్సిపల్ చైర్మన్ చిన్నపాపని కుమార్ గౌడ్**



**గుమ్మడిదల, అక్టోబర్ 17(నేటి ప్రస్థానం):** మున్సిపాలిటీ పరిధిలో ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు మున్సిపల్ చైర్మన్ చిన్నపాపని కుమార్ గౌడ్ తెలిపారు. గుమ్మడిదల మున్సిపాలిటీలోని 11వ వార్డులో నిర్మిస్తున్న సీసీ రోడ్ల పనులను వార్డు కౌన్సిలర్లు, కాలనీవాసులతో కలిసి ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా పనుల పురోగతిని సమీక్షించి, నిర్మాణాల్లో నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ప్రజలకు మెరుగైన రహదారి సౌకర్యాలు కల్పించడంతో పాటు, స్థానికంగా ఉన్న అవసరాలను గుర్తించి అభివృద్ధి పనులకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు చిమ్ముల గోవర్ధన్ రెడ్డి, వార్డు కౌన్సిలర్ కత్తుల రమేష్, నాయకుడు పొన్నాల శ్రీనివాస్ రెడ్డి, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

నేటి ప్రస్థానం
తెలుగు దినపత్రిక



# మున్సిపల్ ఎన్నికలు.. పురపోరుకు టీడీపీ అభ్యర్థుల ఎంపిక.. మరో 34 మంది అభ్యర్థులు ఖరారు

**మచిలీపట్నం మేయర్‌గా షేక్ అబ్దుల్ అబిదా**

**గుంటూరు, ఒంగోలు మేయర్ అభ్యర్థులుగా లక్ష్మీ అపర్ణ, శ్రీ శిల్ప**

**రెండో విడతలో 22 మంది.. మూడో జాబితాలో 12 మంది**

**ఇప్పటివరకు మూడు విడతల్లో 70 మంది పేర్ల ప్రకటన**

**అమరావతి, అక్టోబర్ 17 (నేటి ప్రస్థానం):** ఆంధ్రప్రదేశ్‌లో జరగనున్న మున్సిపల్ ఎన్నికలకు సంబంధించి తెలుగుదేశం పార్టీ అభ్యర్థుల ఎంపికలో భాగంగా మరో రెండు జాబితాలను ప్రకటించింది. రెండో విడతలో 22 మందిని, మూడో విడతలో 12 మందిని ఎంపిక చేసింది. వీరిలో మచిలీపట్నం, గుంటూరు, ఒంగోలు కార్పొరేషన్ల మేయర్ అభ్యర్థులతో పాటు 31 మున్సిపాలిటీలు, నగర పంచాయతీలకు చైర్‌పర్సన్ అభ్యర్థులు ఉన్నారు. మచిలీపట్నం మేయర్ అభ్యర్థిగా షేక్ అబ్దుల్ అబిదాను పార్టీ ఖరారు చేసింది. గుంటూరు కార్పొరేషన్ మేయర్ అభ్యర్థిగా కోవెలమూడి లక్ష్మీ అపర్ణ, ఒంగోలు మేయర్ అభ్యర్థిగా నల్లమల్లి శ్రీ శిల్ప పేర్లను మూడో జాబితాలో ప్రకటించింది. రెండో జాబితాలో ఆకివీడు నుంచి నిలోఫర్ షేక్, బేతంచెర్ల నుంచి ఐ. లోకేశ్ గౌడ్, చీరాల నుంచి యెరిచర్ల హనీ స్పందన, బుచ్చిరెడ్డిపాలెం నుంచి దొడ్ల విజయలక్ష్మి, డోన్ నుంచి కోట్ల సుజాతమ్మ, గుత్తి నుంచి గోవిందరాజులు తమిళ్ సెల్వి, గుంతకల్లు నుంచి యశోద, జంగారెడ్డిగూడెం నుంచి రొంగల అనుష, కదిరి నుంచి షేక్ సమీరా, కళ్యాణదుర్గం నుంచి బుట్న లక్ష్మి పేర్లను ప్రకటించింది.కొండపల్లికి కన్నెకంటి అమూల్య, కొవ్వూరుకు జొన్నలగడ్డ రాధారాణి, నాయుడుపేటకు షకీరా, నందిగామకు శాకమూరి వంశీధర్, నందికొట్కూరుకు ఈ.ఎం. సబురున్నిసా, నర్సీపట్నానికి చింతకాయల పద్మావతి, ప్రొద్దుటూరుకు నంద్యాల రాఘవరెడ్డి, వెంకటగిరికి దొంతు శారద, ఉయ్యూరుకు చేదుర్తిపాటి ప్రవీణ్ కుమార్, ఏలేశ్వరానికి యార్లగడ్డ అక్షిత, ఎమ్మిగనూరుకు మాచాని సునీతను ఎంపిక చేసింది. మూడో జాబితాలో చీమకుర్తికి సిద్ధా సుధాకర్, కనిగిరికి అచ్చాల తిరుపతమ్మ, మండపేటకు వేగుళ్ల అజయ్ కుమార్, నూజివీడుకు బఱ్ఱె ఇళయరాజా, పలమనేరుకు సి. రాజ్యలక్ష్మి, పార్వతీపురానికి బెలగాం కరుణ, పిడుగురాళ్లకు షేక్ బాబావలి, పుంగనూరుకు నయీమా తాజ్, సత్తెనపల్లికి మారెళ్ల రామాంజనేయులు, వినుకొండకు చెరుకుంపాలెం షమీమ్ ఖాన్ పేర్లను ఖరారు చేసింది. తొలి జాబితాలో 36 మంది పేర్లను ప్రకటించిన టీడీపీ, తాజాగా విడుదల చేసిన రెండు జాబితాలతో కలిపి మొత్తం 70 మంది అభ్యర్థులను ప్రకటించినట్లు వెల్లడించింది. అభ్యర్థుల ఎంపికలో మహిళలు, యువతకు ప్రాధాన్యం ఇచ్చినట్లు జాబితాను పరిశీలిస్తే కనిపిస్తోంది. మిగిలిన స్థానాలకు అభ్యర్థులను ఖరారు చేసే ప్రక్రియ కొనసాగుతోంది.

# అనిరుధ్-కావ్య పెళ్లి రిసెప్షన్.. మోదీ, విజయ్‌లను ఆహ్వానించిన మారన్ దంపతులు

**అనిరుధ్, కావ్య రిసెప్షన్‌కు మోదీకి ఆహ్వానం**

**తమిళనాడు సీఎం విజయ్‌కు సైతం ఆహ్వాన పత్రిక**

**చెన్నైలో నవంబరు 21న రిసెప్షన్**

**నవంబరు 11న గ్రీస్‌లో పెళ్లంటూ ప్రచారం**



ప్రముఖ సంగీత దర్శకుడు అనిరుధ్ రవిచందర్, సన్ టీవీ గ్రూప్ అధినేత కళానిధి మారన్ కుమార్తె కావ్య మారన్ వివాహ వేడుకపై ఆసక్తి పెరుగుతోంది. ఈ జంట వివాహ రిసెప్షన్‌కు రావాలంటూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్‌లకు ఆహ్వానం అందింది. ఇందుకు సంబంధించిన ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. కావ్య, అనిరుధ్ వివాహ రిసెప్షన్‌కు రావాలని కోరుతూ కళానిధి మారన్ ప్రధాని మోదీకి ఆహ్వాన పత్రిక అందించారు. కాగా, ఈ కార్యక్రమంలో అనిరుధ్ తల్లిదండ్రులు కూడా పాల్గొన్నట్లు సన్ న్యూస్ వెల్లడించింది. అయితే ఈ భేటీకి సంబంధించిన ఫొటోల్లో అనిరుధ్ కనిపించలేదు.

**సీఎం విజయ్‌ను కలిసిన జంట:** తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్‌ను కూడా కళానిధి మారన్ కలిశారు. కావ్య, అనిరుధ్ రిసెప్షన్‌కు ఆహ్వానించారు. ఈ సందర్భంగా తీసిన ఫొటోలను సన్ న్యూస్ సామాజిక మాధ్యమాల్లో పంచుకుంది. ఇందులో అనిరుధ్ కూడా ఉండడంతో ఈ చిత్రాలు నెటిజన్ల దృష్టిని ఆకర్షిస్తున్నాయి.

**నవంబరు 21న రిసెప్షన్:** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అక్టోబరు 16న ఈ వివాహ రిసెప్షన్ వివరాలను వెల్లడించారు. చెన్నైలో నవంబరు 21న వేడుక జరగనున్నట్లు తెలిపారు. కావ్య తల్లిదండ్రులు కళానిధి మారన్, కావేరి మారన్ హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్‌లో రేవంత్ రెడ్డిని కలిసి ఆహ్వాన పత్రిక అందించారు.

**గ్రీస్‌లో పెళ్లి?:** అనిరుధ్, కావ్య నవంబరు 11న గ్రీస్‌లో వివాహం చేసుకోనున్నట్లు కొన్ని మీడియా కథనాలు పేర్కొన్నాయి. అయితే ఈ పెళ్లి తేదీ, వేడుకల వివరాలను అనిరుధ్, కావ్య అధికారికంగా ప్రకటించలేదు. అనిరుధ్ ప్రముఖ సంగీత దర్శకుడిగా గుర్తింపు పొందారు. 'లియో', 'ఇండియన్ 2', 'కూలీ', జైలర్ వంటి హిట్ చిత్రాలకు సంగీతం అందించాడు. కావ్య మారన్ సన్ టీవీ నెట్‌వర్క్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా బాధ్యతలు నిర్వహిస్తోంది. ఐపీఎల్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టుతోనూ ఆమెకు అనుబంధం ఉంది.

# గుమ్మడిదల మున్సిపల్ కార్యాలయంలో బతుకమ్మ సంబరాలు

**తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు బతుకమ్మ ప్రతీక..సంప్రదాయాలను కాపాడుకోవాలి.. మున్సిపల్ చైర్మన్ చిన్నపాపని కుమార్ గౌడ్**







**గుమ్మడిదల, అక్టోబర్ 17 (నేటి ప్రస్థానం):** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు, ఆడపడుచుల ఐక్యతకు బతుకమ్మ పండుగ ప్రతీకగా నిలుస్తుందని మున్సిపల్ చైర్మన్ చిన్నపాపని కుమార్ గౌడ్ అన్నారు. గుమ్మడిదల మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ దశరథ్ ఆధ్వర్యంలో శనివారం బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మున్సిపల్ చైర్మన్ చిన్నపాపని కుమార్ గౌడ్, వైస్ చైర్మన్ చిమ్ముల సంధ్య గోవర్ధన్ రెడ్డి, తహసీల్దార్ పరమేశం, ఎంపీడీఓ ఉమాదేవి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మహిళా కౌన్సిలర్లు, అధికారులు, మున్సిపల్ సిబ్బంది వివిధ రకాల రంగురంగుల పూలతో బతుకమ్మలను అందంగా పేర్చి, సంప్రదాయబద్ధంగా వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా చైర్మన్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ, బతుకమ్మ పండుగ తెలంగాణ ఆడపడుచుల ఆత్మగౌరవానికి, ఐక్యతకు ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. తరతరాలుగా వస్తున్న సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ప్రజలంతా బతుకమ్మ పండుగను ఆనందోత్సాహాలతో, ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్లు పద్మ,మాధవి, సోనీ, వరలక్ష్మి, , పద్మ చక్రపాణి,రమేష్,సంజీవరెడ్డి, నాయకులు, వెంకట్రాం రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, మహేష్ మహిళలు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.





# మేడ్చల్‌లో వైభవంగా బతుకమ్మ ఉత్సవాలు

**ఆర్‌ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఘనంగా ఏర్పాట్లు.. ఆటపాటలతో సందడి చేసిన మహిళలు**





**మేడ్చల్, నేటి ప్రస్థానం:-** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ వేడుకలు మేడ్చల్ పట్టణంలో అంగరంగ వైభవంగా జరిగాయి. తెలంగాణ ఆడపడుచుల ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను పురస్కరించుకొని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, ఆర్‌ఆర్ ఫౌండేషన్ అధినేత రామన్నగారి రాఘవేంద్ర గౌడ్ ఆధ్వర్యంలో బతుకమ్మ ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. మహిళలు, యువతులు ఉత్సాహంగా పాల్గొని ఆటపాటలతో పండుగ సంబరాలను జరుపుకున్నారు.మేడ్చల్ పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో బతుకమ్మ వేడుకలు సంతోషకర వాతావరణంలో నిర్వహించుకునేందుకు ఆర్‌ఆర్ ఫౌండేషన్ తరఫున ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. మహిళలు ఎలాంటి ఇబ్బందులు లేకుండా బతుకమ్మ సంబరాల్లో పాల్గొనేలా డీజే సౌండ్ బాక్సులు, విద్యుత్ దీపాల అలంకరణతో పాటు అవసరమైన సౌకర్యాలను కల్పించారు. పూలతో అందంగా పేర్చిన బతుకమ్మలను తీసుకొచ్చిన మహిళలు సంప్రదాయ దుస్తుల్లో వేడుకల్లో పాల్గొని, బతుకమ్మ పాటలు పాడుతూ చప్పట్లతో లయబద్ధంగా ఆడిపాడారు. రంగురంగుల పూలతో అలంకరించిన బతుకమ్మలతో పరిసరాలు పండుగ శోభను సంతరించుకున్నాయి.ఈ సందర్భంగా ఆర్‌ఆర్ ఫౌండేషన్ అధినేత రామన్నగారి రాఘవేంద్ర గౌడ్ మాట్లాడుతూ, తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు బతుకమ్మ పండుగ ప్రత్యేక గుర్తింపు నిస్తుందని పేర్కొన్నారు. తెలంగాణ ఆడపడుచుల ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచే ఈ పండుగను మేడ్చల్ పట్టణంలోని మహిళలందరూ ఆనందోత్సాహాల మధ్య జరుపుకోవాలనే ఉద్దేశంతో ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. మన సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవడంతో పాటు వాటి గొప్పతనాన్ని భావితరాలకు తెలియజేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు.బతుకమ్మ పండుగ మహిళల మధ్య ఐకమత్యాన్ని, సోదరభావాన్ని పెంపొందించడంతో పాటు ప్రకృతితో మానవ సంబంధాన్ని చాటిచెబుతుందని ఆయన పేర్కొన్నారు. ప్రకృతిలో లభించే వివిధ రకాల పూలతో బతుకమ్మలను పేర్చి, సంప్రదాయబద్ధంగా పూజించి, ఆటపాటలతో పండుగను జరుపుకోవడం తెలంగాణ ప్రత్యేకత అని తెలిపారు. మహిళలందరూ ఒకచోట చేరి ఉల్లాసంగా, ఉత్సాహంగా పండుగలో పాల్గొనడం ఆనందంగా ఉందన్నారు.ఈ ఉత్సవాల్లో మేడ్చల్ పట్టణానికి చెందిన వందలాది మంది మహిళలు, యువతులు రంగురంగుల బతుకమ్మలతో పాల్గొని సంప్రదాయ ఆటపాటలతో సందడి చేశారు. బతుకమ్మ పాటలు, నృత్యాలతో వేడుకల ప్రాంగణం మార్మోగింది. పండుగ సందర్భంగా మహిళల్లో నెలకొన్న ఉత్సాహం, ఆనందం ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించేలా వేడుకలు కొనసాగాయి. ఈ కార్యక్రమంలో మేడ్చల్ ఎస్‌హెచ్‌ఓ అంజిరెడ్డి, మాజీ కౌన్సిలర్ కొడే మహేష్, కటిక వినయ్, ఆర్‌ఆర్ ఫౌండేషన్ ప్రతినిధులు, స్థానిక కాంగ్రెస్ నాయకులు, మహిళలు, యువతులు, పట్టణ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మేడ్చల్ డిపోలో టీజేఎంయూ విజయోత్సవ సంబరాలు

**కార్మిక సంఘం ఎన్నికల్లో గౌరారం జగన్ గౌడ్, డిపో సెక్రెటరీగా శ్రీనివాస్ విజయం**



మేడ్చల్ నేటి ప్రస్థానం:- మేడ్చల్ ఆర్టీసీ డిపోలో తెలంగాణ జాతీయ మజ్దూర్ యూనియన్ (టీజేఎంయూ) కార్మిక సంఘం ఎన్నికల్లో విజయం సాధించిన సందర్భంగా శనివారం డిపో వద్ద విజయోత్సవ సంబరాలు ఘనంగా నిర్వహించారు. యూనియన్ అధ్యక్షుడిగా గౌరారం జగన్ గౌడ్, డిపో కార్యదర్శిగా శ్రీనివాస్ విజయం సాధించడంతో కార్మికులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కార్మికులు టపాసులు కాల్చి, స్వీట్లు పంచుకుంటూ తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఎన్నికల్లో విజయం సాధించిన నాయకులను శాలువాలతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్మికుల ఐక్యత, సంఘటిత శక్తికి ఈ విజయం నిదర్శనమని పలువురు నాయకులు పేర్కొన్నారు.

**టీజేఎంయూ నూతన కార్యవర్గం**

ఎన్నికల్లో వివిధ బాధ్యతలకు ఎంపికైన వారిలో గౌరవ అధ్యక్షుడిగా గౌరారం జగన్ గౌడ్, డిపో అధ్యక్షుడిగా నర్సింహా, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా సాదిక్ పాషా, ఉపాధ్యక్షులుగా టి.సి. శేఖర్, సునీత, డిపో కార్యదర్శిగా శ్రీనివాస్ ఎన్నికయ్యారు. అలాగే గ్యారేజ్ కార్యదర్శిగా గణపతి, గ్యారేజ్ అధ్యక్షుడిగా సంతోష్, జాయింట్



సెక్రటరీగా తాహేర్ హుస్సేన్, చీఫ్ అడ్వైజర్‌గా వెంకటేష్, అడ్వైజర్‌గా శశిరాజ్ బాధ్యతలు చేపట్టనున్నారు. వీరితో పాటు రఘువీర్ రాజు, వెంకటేష్, రాజేందర్ తదితరులు యూనియన్ కార్యకలాపాల్లో భాగస్వాములు కానున్నారు.

**కార్మికుల సంక్షేమానికి నిరంతరం కృషి చేయాలి**

ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, కార్మికుల సమస్యల పరిష్కారం, వారి హక్కుల పరిరక్షణ, సంక్షేమం కోసం నూతన కార్యవర్గం సమష్టిగా కృషి చేయాలని ఆకాంక్షించారు. కార్మికుల సమస్యలను యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లి, వాటి పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. ఎన్నికల్లో విజయం సాధించిన నాయకులకు పలువురు కార్మికులు, నాయకులు అభినందనలు తెలిపారు. ఈ విజయోత్సవ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు రామన్నగారి శ్రీనివాస్ గౌడ్, చెరువుకొమ్ము శ్రీనివాస్ గౌడ్, ఎల్లంపేట్ మున్సిపాలిటీ బీజేపీ అధ్యక్షుడు శ్రీశైలం యాదవ్, బీజేపీ ప్రధాన కార్యదర్శి జాకట ప్రేమ్ దాస్, బీజేవైఎం జిల్లా మాజీ కార్యదర్శి రాఘవ రెడ్డి, డివిజన్ బీజేపీ కార్యదర్శి బండి విష్ణు గౌడ్, బీజేపీ నాయకులు వంశీ రెడ్డి, సత్యనారాయణ రెడ్డి, సుధాకర్ గౌడ్, రాజేష్, బాల్ రెడ్డి, గోపు నాగరాజ్, ఈశ్వర్, బాబు రాజ్, గౌలికర్ మహేష్, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.